బాధిత కుటుంబాలకు పరామర్శ

భీంపూర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, జనవరి 26: బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు భీంపూర్, మాన్నాపూర్ గ్రామాల్లో రాథోడ్ బన్నీ, మహత్మే చంద్రకాంత్, కుమ్రం సీతారామ్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్‌నాయక్, వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, కోఆప్షన్ సభ్యుడు ఉదయ్‌కాంబ్లే, సర్పంచుల సంఘం మాజీ మండలాధ్య క్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ఖాశీం, ఎస్టీ సెల్ రాథోడ్ సుభాష్, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ,జాడే దయనంద్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత

మాన్నాపూర్‌లో బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చిన ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్

నార్నూర్, జనవరి 26: మండలంలోని మాన్నాపూర్ గ్రామానికి చెందిన మహత్మే చంద్రకాంత్, కుమ్ర సీతారామ్ శనివారం మృతి చెందగా ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబీకులను పరామర్శించి, భరోసా ఇచ్చారు. అనంతరం తన వంతు బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షు డు ఉర్వేత రూప్‌దేవ్, సహకార సంఘం కోఆప్షన్ సభ్యుడు ఉదయ్‌కాంబ్లే, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, ఎస్టీ సెల్ రాథోడ్ సుభాష్, రాథోడ్ దిలీప్, జై భారత్ జిల్లా కోఆర్డినేటర్ పెందోర్ దీపక్ తదితరులున్నారు.

నిరంతర విద్యుత్ కోసం కృషి

నేరడిగొండ, జనవరి 26 : జిల్లాలో మారుమూల గ్రామాల వరకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ సీఈ చవాన్ జైవంత్‌రావ్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్టి ఘాట్ ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఇన్సులేటర్ చెడిపోవడంతో మరమ్మతులను దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపైన ఉన్న స్తంభానికి మొరం తవ్వడంతో కొండ ఎక్కడానికి వీలులేకుండా పోయిందన్నారు. సిబ్బంది కష్టంగా 300 ఫీట్ల ఎత్తైన కొండపైకి ఎక్కి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారన్నారు. ఇక్కడ ఈఈ హరికృష్ణ, ఏడీ లక్ష్మణ్, ఎంఆర్‌టీ డీఈఈ ప్రభాకర్, ఏఈఈలు నాగేంద్రప్రసాద్, జాదవ్ రాజు, ఎల్‌ఐలు, ఎల్‌ఎంలు సిబ్బంది ఉన్నారు.

చనాకా కోరాటా బ్యారేజ్‌పై కాంగ్రెస్ నిర్లక్ష్యం

- మాజీ మంత్రి జోగు రామన్న
- చనాకా కొరటా బ్యారేజ్ పంప్ హౌస్ సందర్శన

చనాక కొరటా బ్యారేజ్‌తో పంప్ హౌస్‌ను సందర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 26 : వ్యవసాయ రైతులకు ఆధారితంగా ఉన్నటువంటి చనాకా కోరాటా బ్యారేజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అయన విస్తృతంగా పర్యటించారు. మొదట పంట క్షేత్రాలను పరిశీలిస్తూ రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చనాకా కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్‌ను సందర్శించారు. బ్యారేజ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని రైతు బంధు, రైతు బీమా రాక రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక పక్క రైతుల పిట్టల రాలిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతాంగ సమస్యలకు పరిష్కారాన్ని చూపెడుతూ 60 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చనాకా కొరాటా బ్యారేజ్ నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో బ్యారేజ్ పనులు మధ్యలోనే ఆగిపోవడం జరిగిందని పెండింగ్ బకాయిలను విడుదల చేసి పంప్ హౌస్ పనులతోపాటు బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాసం నర్సింగ్ రావు, ఇజ్జగిరి నారాయణ, మహేశ్, బట్టు సతీశ్, కొండా గణేశ్, అడపా తిరుపతి, అన్నెలా వసంత్, అశోక్, దయానంద్, కలీం పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

జైనథ్, జనవరి 26 : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. ఆదివారం మండలంలోని మాకోడా గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వివేకానంద యూత్ చేపడతున్న క్రికెట్ క్రీడా పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. మాజీ మంత్రి జోగు రామన్న హాజరై క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ, యువత చదువుతోపాటు క్రీడా రాణించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇలాంటి పోటీలతో యువతలో స్నేహభావాన్ని పెంపెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ఇజ్జగిరి నారాయణ, సర్పంచ్ వెంకన్న, మాజీ ఎంపీటీసీలు రామ్‌రెడ్డి, ఊశన్న, మాజీ ఎంపీపీ గోవర్ధన్, లింగారెడ్డి, పురుషోత్తం, వేణు యాదవ్, బట్టు సతీశ్, ఉగ్గే విఠల్, దత్తు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్, జనవరి 26 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కుస్నపెల్లి మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదివారం లక్ష్మీపూర్ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ ఆడప తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగావ్, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, నాయకులు ఇజ్జగిరి నారాయణ, సతీశ్, భగత్ గౌతమ్, లక్ష్మీపూర్, గ్రామస్తులున్నారు.

మాకెందుకు పథకాలు ఇవ్వరు..?

- అధికారులను నిలదీసిన మల్లాపూర్ అనుబంధ గ్రామస్తులు

దిలావర్‌పూర్,సాంగ్వీ గ్రామ సభలో ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

దిలావర్‌పూర్, జనవరి 26 : 'మాది ఊరు కాదా? మేం ఏమైనా అడవిలో ఉంటున్నామా? గ్రామసభలో తమ గ్రామానికి చెందిన లబ్ధిదారుల పేర్లు ఎందుకు చదవడం లేదు.' అని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వీ అనుబంధ గ్రామమైన మల్లాపూర్ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఆదివారం సాంగ్వీ గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాల కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హత పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందిస్తుండగా మల్లాపూర్ గ్రామానికి చెందిన యువకులు, మహిళలు, రైతులు 'మా ఊరులో అర్హులైన వారు ఒక్కరు కూడా లేరా? ఎక్కడో అడవిలో ఉన్నామనుకుంటున్నారా? అని అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన ఒక్క లబ్ధిదారునికి అర్హత పత్రం ఇవ్వరా? అని అధికారులపై మండిపడ్డారు. మేం ఎన్నికలప్పుడు మాత్రమే గుర్తుకొస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులకు పని ఉంటే మా ఊరుకు వస్తారు. కానీ ఈ సందర్భంలో మేం గుర్తుకు రామా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చెరుకుని ఆందోళన చేస్తున్న వారిని నచ్చజెప్పారు. చివరకు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మల్లాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులను ఎంపిక చేసిన వారికి అర్హత పత్రాలను అందించారు. సాంగ్వీ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని లబ్ధిదారులు పత్రాలను అందజేశారు.

ఆదిలాబాద్ జిల్లాలోని పరేడ్ మైదానంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం చేతుల మీదుగా ప్రశంసా పత్రంతోపాటు మెమెంటోను అందుకుంటున్న అదనపు కలెక్టర్ శ్యామలా దేవి

ఉత్తమ అధికారులకు ప్రశంస

డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

ట్రాఫిక్ సీఐ ప్రణాయ్‌కుమార్

రిమ్స్ డైరెక్టర్‌జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఎస్‌బీ కానిస్టేబుల్ జోగు శివకుమార్

జిల్లా సంక్షేమాధికారి బీ సబిత

ఎంవీఐ ప్రదీప్‌కుమార్

బడి పిల్లల రచనలకు దక్కిన గౌరవం

నమస్తే నెట్‌వర్క్, జనవరి 26 : 'ఆరోగ్య పాఠశాల-లక్ష్మీపూర్ బడి పిల్లలు' పేరుతో విద్యార్థులు రాసిన కథల పుస్తకం కవర్ పేజీని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శకటంపై ప్రదర్శించడం తమ పాఠశాలకు అరుదైన గౌరవంగా భావిస్తున్నామని లక్ష్మీపూర్ జడ్పీఎస్‌ఎస్ హెచ్‌ఎం పోరెడ్డి అశోక్ అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదిలాబాద్‌లో పరేడ్ గౌండ్స్‌లో 'ఆరోగ్య పాఠశాల' శకటాన్ని ప్రదర్శించారు. శకటంపై లక్ష్మీపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల రాసిన పుస్తకానికి అధికారులు ప్రాధాన్యమివ్వడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి పత్తి కొనుగోలు నిలిపివేత

బోథ్, జనవరి 26 : నేరడిగొండలోని శ్రీదర్శన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పత్తి నిల్వలు అధికంగా ఉన్నందున ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 నుంచి యథావిధిగా కొనుగోళ్లు చేస్తారని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్ టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యూయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యూయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యూయెల్లర్స్ దృష్టి ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాల లో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ అర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహొతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేం తదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



సూచీలకు బడ్జెటే దిక్సూచి

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

తపాలా పథకాలు భళా

గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

తపాలా శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), మంత్లీ ఇన్‌కమ్ డిపాజిట్ (ఎంఐడీ), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో సురక్షిత పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. అంతేగాక వీటికి వడ్డీరేటు 6.7 శాతం నుంచి 8.2 శాతం వరకు ఉన్నది. ఈ పథకాల ద్వారా ఇతర ప్రయోజనాలూ మదుపరులకు అందుతుండటం విశేషం.

పథకం	వడ్డీ (%)
పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్	4.00
ఏడాది, రెండేండ్ల ఎఫ్‌డీ	6.9, 7,
మూడు, ఐదేండ్ల ఎఫ్‌డీ	7.1, 7.5
పోస్టాఫీస్ ఆర్‌డీ	6.70
ఎస్‌సీఎస్ఎస్	8.20
పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్	7.40
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.70
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.10
కిసాన్ వికాస్ పత్ర	7.50
మహిళా సమ్మాన్	7.50
సుకన్య సమృద్ధి యోజన	8.20